క్లుప్తంగా

ఓంకారేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



ఆలయంలో యజ్ఞం చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల ఓంకారేశ్వర స్వామి ఆలయ సప్తదశ(17)వ వార్షికోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. గణపతి పూజతో ప్రారంభమైన ఉత్సవాల్లో మొదటిరోజు స్వామివారికి ప్రత్యేకలంకరణ, పూజలు చేశారు. అనంతరం యజ్ఞ యాగ కార్యక్రమాలు చేశారు. భక్తులు యాగంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆ ఆలయ చైర్మన్ బోధ మాధవరెడ్డి, అర్చకుడు చంద్రశేఖర్, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా జూనియర్ కళాశాల వార్షికోత్సవం



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినిలు

మీర్‌పేట: మీర్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం మంగళవారం కళాశాల ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని పెట్టుకొని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని, ముఖ్యంగా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఎరువులు తయారు చేయాలి

మున్సిపల్ ప్రత్యేకాధికారి శ్రీనివాస్

తుక్కుగూడ: డంపింగ్‌యార్డ్‌లో కూరగాయాలు, ఇతర వ్యర్థాలను ఉపయోగించి ఎరువులను తయారు చేయాలని మున్సిపాలిటీ ప్రత్యేకాధికారి శ్రీనివాస్ సూచించారు. మంగళవారం పుర పరిధిలోని రావిర్యాల డీఆర్‌సీ సెంటర్, తుక్కుగూడ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ యార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డీఆర్‌సీ సెంటర్‌లో వ్యర్థాలను ఎరువులుగా తయారు చేయడానికి అవసరమైన యంత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అసంపూర్తిగా ఉన్న వెజ్, నాన్ వెజ్ మార్కెట్ పనుల పూర్తికి అవసరమైన ప్రణాళికలు రుపొందించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి, డీఈఈ యాదయ్య, ఏఈ పి.గుణాకర్, టీపీఎస్ వెంకట రఘునాథ్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌కు పైకప్పు ఏర్పాటు



మ్యాన్‌హోల్‌పై పైకప్పు ఏర్పాటు చేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీలోని బృందావన్ కాలనీ ప్రధాన రహదారిపై పైకప్పు లేకుండా ప్రమాద భరితంగా మారిన విషయమై 'నోరు తెరిచిన మ్యాన్‌హోల్' అనే శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మ్యాన్‌హోల్‌కు పైకప్పు ఏర్పాటు చేసి మరమ్మతులు నిర్వహించారు. సమస్యను వెలుగులోకి తెచ్చి పరిష్కారమయ్యేలా చొరవ చూపిన 'సాక్షి'కి స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు ..టమాటా రూ.13, వంకాయ రూ.23, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.40, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.09, క్యారెట్ రూ.40, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.21, ఉల్లిగడ్డ రూ.34, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.28, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.43, మునగ రూ.55, కందగడ్డ రూ.65, బీట్‌రూట్ రూ.17, కీర రూ.23, బీన్స్ రూ.40, క్యాప్సికమ్ రూ.35.

అధ్వాన రోడ్డుతో అవస్థలు

- ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని సాయిరెడ్డిగూడ-కుర్మిద్ద దారి
- వాహనదారులు, ప్రజలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా సాయిరెడ్డిగూడ-కుర్మిద్ద రోడ్డు

కందుకూరు: ఏళ్ల తరబడి అధ్వానంగా మారిన రోడ్డును పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో ఆ రోడ్డుపై ప్రయాణించే వారితో పాటు రైతులకు అవస్థలు తప్పడం లేదు. కేవలం 6 కిలోమీటర్ల రోడ్డును అభివృద్ధి పరిస్తే చాలు, చాలా గ్రామాల వారికి దూరభారం తగ్గుతుంది. అయినా సంబంధిత అధికారులు మాత్రం తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇది మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ నుంచి కుర్మిద్ద గ్రామం వరకు ఉన్న రోడ్డు పరిస్థితి.

ప్రజలకు తప్పని తిప్పలు

1996 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వ హయాంలో సాయిరెడ్డిగూడ నుంచి కుర్మిద్ద మధ్య ఉన్న ఎనిమిది కిలోమీటర్ల దారిని మెటల్ రోడ్డుగా నిర్మించారు. ఆ తర్వాత 2013లో ఎన్ఆర్‌జీఎస్ నుంచి మధ్యలో అవసరమున్న ప్రాంతాల్లో రోడ్డుపై కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. ఆ తర్వాత కేవలం ఒక్క కిలోమీటర్ మాత్రమే రీ-మెటల్ వేశారు. కాగా కుర్మిద్ద వైపు నుంచి మర్లకుంటతండా వరకు కేవలం రెండు కిలోమీటర్లు దూరం మాత్రమే బీటీగా మార్చారు. మిగతా ఆరు కిలోమీటర్లను అభివృద్ధి చేయకుండా వదిలేశారు. అప్పటి నుంచి ఇంత వరకు ఆ రోడ్డు అభివృద్ధిని పాలకులు పట్టించుకోలేదు. దీంతో రోడ్డు అధ్వానంగా మారడంతో పాటు ఇరువైపులా కంప చెట్లు పెరిగి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. అటు వైపు వెళ్లే రైతులు, ఇతర గ్రామాల వారికి తిప్పలు తప్పడం లేదు.

తగ్గనున్న దూరభారం

ఆరు కిలోమీటర్ల మేర రోడ్డును అభివృద్ధి పరిస్తే కుర్మిద్ద మీదుగా మీర్కాన్‌పేట నుంచి అటు ఇబ్రహీంపట్నంలోని కోర్టుకు, ఇటు గ్రీన్ ఫార్మా పోలీస్ స్టేషన్‌కు వెళ్లడానికి సాయిరెడ్డిగూడతో పాటు అటు వైపు ఉన్న తండాలు, గ్రామాల వారికి సులభంగా మారుతుంది. సమయంతో పాటు దూరం తగ్గుతుంది. మరోవైపు శ్రీశైలం హైవే కడ్తాల్ నుంచి సాగర్ రహదారిని కలిపే ప్రధాన లింకు రోడ్డు అవుతుంది. సాయిరెడ్డిగూడ, అన్మాస్‌పల్లి, మర్లకుంట తండా, పోతుబండతండా, మంగలపల్లితండా తదితర గ్రామాల వారికి రాకపోకలకు ఇబ్బంది తప్పుతుంది.

రోడ్డును అభివృద్ధి చేయాలి



సాయిరెడ్డిగూడ మీదుగా కుర్మిద్ద వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. వ్యవసాయ పొలాలతో పాటు కనీసం స్మశానవాటికకు అంత్యక్రియలకు వెళ్లాలన్నా రైతులు, గ్రామస్తులకు ఇబ్బందిగా ఉంది. రోడ్డును అభివృద్ధి పరిస్తే ఇబ్రహీంపట్నం కోర్టుకు, గ్రీన్ ఫార్మా పోలీస్ స్టేషన్‌కు వెళ్లడానికి దగ్గరి దారవుతుంది. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

– ఎస్.వెంకట్రామ్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్, సాయిరెడ్డిగూడ

బీటీగా మార్చాలి



మా గ్రామం నుంచి కుర్మిద్ద వైపు వెళ్లే రోడ్డును 29 ఏళ్ల క్రితం మెటల్‌గా మార్చారు. ప్రస్తుతం ఆ దారి అధ్వానంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు పెరిగి అధ్వానంగా మారింది. అటువైపు వెళ్లే రైతులతో పాటు ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి నిధులు కేటాయించి బీటీగా మార్చాలి.

– ప్రభాకర్‌రెడ్డి, రైతు, సాయిరెడ్డిగూడ

ప్రమాదాలకు గురవుతున్నాం



మా పోతుబండతండా నుంచి సాయిరెడ్డిగూడ మీదుగా కడ్తాల్ మార్కెట్‌కు నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి నిత్యం వెళ్లి వస్తుంటాం. బైక్‌పై వెళ్లి వచ్చే క్రమంలో తరచూ ప్రమాదాలకు గురవుతున్నాం. ఆ దారిని బీటీరోడ్డుగా నిర్మిస్తే మాకు రాకపోకలకు సులభం అవుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డును అభివృద్ధి చేసేలా చూడాలి.

– బాలకోటినాయక్, పోతుబండతండా

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని అన్ని మజీద్‌ల వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపల్ అధికారులు, ముస్లిం నాయకులతో కలిసి మంగళవారం సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 190 మజీదులు ఉన్నాయన్నారు. ఆయా మజీదుల వద్ద తాగునీరు, పారిశుధ్యం, విద్యుద్దీపాల సమస్య లేకుండా చూడాలని అధికారులు ఆదేశాలిచ్చామన్నారు. అక్కడక్కడా కొన్ని స్తంభాలు లేవని, స్తంభాల ఏర్పాటు, రోడ్లకు మరమ్మతులు, లైటింగ్ సదుపాయాల కోసం ఒక్కో వార్డుకు రూ.1లక్ష కేటాయించామని తెలిపారు. ఇమామ్, మోజంలకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గౌరవ వేతనం ఇచ్చేవారమని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన రిజర్వాయర్లు పూర్తయినందున, ఇకపై రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తామన్నారు. మున్సిపాలిటీలో మొత్తం 123 బోర్లు ఉన్నాయని, అందులో 90 మాత్రమే పని చేస్తున్నాయని, మిగిలిన వాటికి మరమ్మతులు చేయాలని సూచించామని పేర్కొన్నారు. రంజాన్ ప్రార్థనలకు సంబంధించిన ఏడు ఈద్గాల వద్ద సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీమేరకు మజీద్‌లకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని, ముస్లింలకు రంజాన్ తోఫా కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ బి.వెంకట్రామ్, డీఈ ఇష్రత్ ఆయేషా, మాజీ చైర్మన్ అబ్దుల్లా సాది, నాయకులు సూరెడ్డి కృష్ణారెడ్డి, ఫర్మోద్దీన్ హామెద్, యంజాల జనార్దన్, షేక్ అఫ్జల్, శంకర్, అర్జున్, సయ్యద్ యూసుఫ్ పటేల్, శంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

జల్‌పల్లి మున్సిపాలిటీలో 64 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పి.సబితారెడ్డి మంగళవారం అందజేశారు. పహాడీషరీఫ్‌లోని ప్రీమియర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని బాలాపూర్ తహసీల్దార్‌తో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన

శంకర్‌పల్లి: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులను అధికారులు గుర్తించిన విషయం తెలిసిందే. అయితే శంకర్‌పల్లి మండలంలోని ఏర్వగూడ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద తీసుకొని 73మంది లబ్ధిదారులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వారిలో మొదటి విడతగా 11మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. మంగళవారం చేవెళ్ల హౌసింగ్ డీఈ దస్తగిరి, ఏఈ వాహాబ్ ఏర్వగూడ గ్రామంలో పర్యటించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం గురించి, ఏఏ దశల్లో ఎంత మొత్తం డబ్బు వస్తుందనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య, పంచాయతీ సెక్రటరీ హమీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మహా రుద్రాభిషేకం



మహారుద్ర పారాయణం చేస్తున్న భక్తులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని శ్రీశృంగేరి జగద్గురు శంకరాచార్య మహాసంస్థానం (శ్రీ శృంగేరి శంకరమఠం)లో సువర్ణభారతీ మహోత్సవంలో భాగంగా 1311 రుద్రములతో శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి రుద్రపారాయణ సహిత విశేష రుద్రాభిషేకం కొనసాగుతుంది. మహాశివరాత్రి పురస్కరించుకొని లోక కల్యాణ కోసం రుద్ర పారాయణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం(నేడు) మహా శివరాత్రి విశేష షట్కాల పూజ, సామూహిక రుద్రాభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దేప భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్ బంగారయ్య, సూర్యనారాయణ శర్మ, గౌరిభాస్కర్, సుధాకర్ శర్మ, శోభనాద్రి, నరసింహమూర్తి, వ్యాప్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహం.. వార్షికోత్సవం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఆర్క్ ప్రీ స్కూల్(ఆర్టిస్టిక్ క్లిక్ ది ప్రీ స్కూల్) వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ న్యాయవాది జాన్సీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా చిన్నారులకు మెరుగైన విద్యాతో పాటు వారిలోని ప్రతిభను గుర్తించి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకురాలు ప్రిన్సిపాల్ నీలిమ, కో ఫౌండేషన్ చక్రీ పాల్గొన్నారు.

శంషాబాద్ ఎస్సీసెల్ అధ్యక్షుడిగా గణేశ్



ఉత్తర్వులు అందుకుంటున్న రాచమల్ల జగన్

శంషాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ శంషాబాద్ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా రాచమల్ల గణేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పి.పెంటయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ చేతులమీదుగా ఆయన ఉత్తర్వులు అందుకున్నాడు. దళితుల అభ్యున్నతికి కాంగ్రెస్ చేసిన కృషి మరే పార్టీ చేయలేదని ఆయన అన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పి.సంజయ్‌యాదవ్, పరమేష్ అక్రమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

చైతన్యపురి: కాలనీల్లో నూతన లైన్లు వేసి డ్రైనేజీ, తాగునీటి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా అన్నారు. మంగళవారం డివిజన్‌లోని మారుతీనగర్ కాలనీలో వాటర్‌వర్క్స్ డీజీఎంతో కలిసి పర్యటించారు. రోడ్‌నంబర్-2, 12ఎఫ్‌లలో చాలా రోజులుగా డ్రైనేజీ, తాగునీటి సమస్య ఉందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. 300 ఎంఎం కొత్త డ్రైన్‌లైన్ మంజూరు చేసి సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని కార్పొరేటర్ డీజీఎంను కోరగా వెంటనే నిధులు మంజూరు చేసి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే రోడ్ నం-12ఎఫ్‌లో కొత్త వాటర్ లైన్‌ను డీఏ లైన్‌గా మారుస్తామని డీజీఎం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ లైన్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, గల్వర్ ఇన్‌చార్జి శ్రీకాంత్ స్థానిక నాయకులు నవీన్‌యాదవ్, ఉపేందర్, అంజిబాబు, రాజేష్, కులదీప్, కాలనీ అధ్యక్షుడు రవి కార్యదర్శి ప్రభాకర్, కోశాధికారి శ్రీనివాస్ కృష్ణ, రవి కేశవ్, సత్తయ్య పాల్గొన్నారు.

సూర్యగిరి ఎల్లమ్మకు పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి భక్తులకు ఇలవేల్పుగా మారింది. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం సమర్పించుకున్నారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మహేశ్వరం: గ్రామీణ ప్రాంత పేదలకు అవేర్ సంస్థ వారు ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం అభినందనీయమని మాణిక్యమ్మగూడ మాజీ సర్పంచ్ మాసారం చంద్రయ్యగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మాణిక్యమ్మగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవేర్ సంస్థ ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించి రోగులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో 96 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యురాలు అనితా, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, అవేర్ సంస్థ కార్యనిర్వాహక అధికారి వెంకన్న, డైరెక్టర్ వరుణ్, వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రేగడిఘనాపూర్‌లో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని ఇంద్రారెడ్డినగర్, ఖానాపూర్, రేగడిఘనాపూర్ గ్రామాల్లో సీసీరోడ్డు పనులకు మంగళవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న అన్ని వార్డుల్లో సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో అన్ని గ్రామాల్లో రోడ్లు వేస్తున్నారని, ఇంకా గ్రామాల్లో మిగిలిపోయిన రోడ్లు కాని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలను కూడా పూర్తిచేసేందుకు నిధులు తీసుకొస్తానన్నారు. ఈ సందర్భంగా ఇంద్రారెడ్డినగర్‌లో రూ.10లక్షలు, ఖానాపూర్‌లో రూ.15లక్షలు, రేగడిఘనాపూర్‌లో రూ.15లక్షల నిధులతో వేస్తున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జి.పెంటయ్యగౌడ్, పీఏసీఎస్ ముడిమ్యాల చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, ఆయా గ్రామాల పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించం

తహసీల్దార్ కృష్ణయ్య



ప్రభుత్వ భూమిలో వేసిన ఫ్రీకాస్టింగ్‌లను జేసీబీ తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

చేవెళ్ల: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని మండల తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. మండలంలోని కమ్మెట గ్రామంలో సర్వే నెం.270లో ఉన్న ప్రభుత్వ భూమి 2 ఎకరాలలో వేసిన ఫ్రీకాస్టింగ్ పలకలను మంగళవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఆక్రమించటం చట్టరీత్యా నేరమన్నారు. కమ్మెట గ్రామంలో ఉన్న 2 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించి ఫ్రీకాస్టింగ్ వేసినట్లు సమాచారం అందడంతో అక్కడికి పరిశీలించామన్నారు. రెవెన్యూ అధికారులు సర్వే రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమిలోకి వచ్చిన ఫ్రీకాస్ట్ గోడలను జేసీబీతో కూల్చివేసినట్లు తెలిపారు. అక్రమంగా ప్రభుత్వ భూమిలోకి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిని సర్వే చేసి గుర్తించి హద్దులు వేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూమిని కాపాడుకునే బాధ్యత అధికారులదేనని, ఎవరైనా ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులతో టోల్‌ప్లాజా సిబ్బంది, నాయకులు

మాజీ సర్పంచ్ జయశ్రీ

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని మాజీ సర్పంచ్ జయశ్రీచంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని విఠ్యాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఐ సడక్ జడ్చర్ల ఎక్స్‌ప్రెస్ వే ప్రైవేట్ లిమిటెడ్ రాయికల్ టోల్‌ప్లాజా సహకారంతో స్వెటర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ సర్పంచ్ హాజరై విద్యార్థులకు స్వెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదిగినప్పుడే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు స్వెటర్లు అందించిన టోల్‌ప్లాజా సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా సిబ్బంది జగదీశ్, శ్రీనివాస్, శ్రీకాంత్, సందీప్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు రానివ్వద్దు

రామేశ్వరంలో ఏర్పాట్లను పరిశీలించిన సీఐ విజయ్‌కుమార్



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న సీఐ విజయ్‌కుమార్ తదితరులు

షాద్‌నగర్‌రూరల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వొద్దని పట్టణ సీఐ విజయ్‌కుమార్ సూచించారు. ఉత్తర రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణ సీఐ విజయ్‌కుమార్ రామేశ్వరం దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భక్తుల కోసం ఏర్పాటు చేసిన వసతులు, వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. భక్తుల రాకతో వాహనాల రద్దీ, ట్రాఫిక్ నియమాలపై ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్‌తో మాట్లాడారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. మహాశివరాత్రి సందర్భంగా ఉత్తర రామలింగేశ్వరస్వామి దేవాలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. నియోజకవర్గంతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైద్రాబాద్, వికారాబాద్, కర్నూల్ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తారన్నారు. దైవదర్శనం కోసం దూర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చే భక్తులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించేందుకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తమవంతుగా కృషి చేయాలని సూచించారు. భక్తులు తమ విలువైన వస్తువులు, బంగారం వంటి వాటిని జాగ్రత్తగా చూసుకోవాలని, ఆలయ పరిసర ప్రాంతాల్లో కొత్త వ్యక్తులను నమ్మొద్దని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు చేపడుతామన్నారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో మాజీ సర్పంచ్ సంపత్‌కుమార్, ఆలయ ఈఓ శివకుమార్, ఎస్ఐ శరత్‌కుమార్, నాయకులు రాయికల్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.